క్లుప్తంగా

మహిళ ఆరోగ్యమే కుటుంబానికి పునాది


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ పద్మావతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆరోగ్యవంతమైన మహిళ – శక్తివంతమైన కుటుంబానికి పునాది అని ఐసీడీఎస్ ఏలూరు అర్బన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.పద్మావతి అన్నారు. స్థానిక జేపీ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో స్వస్థ నారీ, స్వశక్త పరివార్ అభియాన్, పోషణ్ మా 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి పద్మావతి మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. స్థూలకాయ నివారణ, బాల్యదశ సంరక్షణ, విద్య, శిశు, చిన్న పిల్లల ఆహారపు అలవాట్లు, పురుషుల భాగస్వామ్యం, సమగ్ర పోషణ అనే అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి నీలిమ, 3వ సెక్టార్ సూపర్‌వైజర్ మీనాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ శ్రీలతకు పదోన్నతి


శ్రీలతను సత్కరిస్తున్న ఎంపీపీ, సిబ్బంది

దెందులూరు: ఏలూరు రూరల్ ఎంపీడీఓ వి.శ్రీలతకు పశ్చిమగోదావరి జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది, ఎంపీపీ శ్రీనివాస రాజు శ్రీలతను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీడీఓగా భీమనేని దయాసాగర్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

బ్రాహ్మణ యువత భరోసాకు కృషి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బ్రాహ్మణ నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు కృషిచేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అడ్వైజరీ కమిటీ చైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. తమ పోరాటాల ఫలితంగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వాలు కృషి చేశాయన్నారు. డిసెంబర్ 13న గుంటూరు వేదికగా బ్రాహ్మణ నిరుద్యోగ యువతకు 80 ప్రముఖ కంపెనీల సౌజన్యంతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు చెప్పారు. దరఖాస్తులు, తదితర అంశాలపై ఈ నెల 22న బ్రాహ్మణ సామాజిక వర్గాల గ్రూప్‌ల ద్వారా తెలియజేస్తామన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాల అదుపు

- ఆశ పడ్డారో.. ఉన్నదంతా ఊడ్చేస్తారు
- సైబర్ నేరాలపై 1930కు కాల్ చేయండి

ఏలూరు టౌన్: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందరి సొంతం. ఆధునిక యుగంలో మానవులు శాస్త్ర, సాంకేతికతతో కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఆఖరికి అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)తో కృత్రిమ మేధ మనిషికి కొత్తకొద్ద దారులు చూపిస్తోంది. ఇక నేరగాళ్లు సైతం నేటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని ఇట్టే ప్రజలను నట్టేట ముంచుతున్నారు. ప్రతి రోజూ ఎంతోమంది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని డబ్బులు పోగొట్టుకుంటున్నారు. పోలీస్ అధికారులు నిత్యం ప్రజలను అప్రమత్తం చేస్తూనే ఉన్నా, సొమ్ములు కాజేసేవారి సంఖ్య పెరుగుతునే ఉంది. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే, అప్రమత్తతే ఏకైక మార్గం అంటున్నారు పోలీస్ అధికారులు.

ఆశపడ్డారా... వలలో పడినట్లే

ఏలూరుకు చెందిన నాగదాసరి భరత్ రత్నరాజు వైద్య చికిత్స పరికరాలను కొనుగోలు చేస్తుంటారు. రత్నరాజు ఇండియా మార్ట్‌లో డయాలసిస్ పరికరాలు (డయాలైజర్లు, రక్త ట్యూబులు) కొనుగోలు చేసేందుకు ఇండియా మార్ట్‌లో సెర్చ్ చేశారు. ఒక సరఫరా దారుడు మాయమాటలను నమ్మి రూ.40 వేలు సొమ్ము చెల్లించాడు. అనంతరం సరఫరాదారుడి ముసుగులోని మోసగాడు ప్రతి అర్ధగంటకు ఒకసారి మరో రూ.10 వేలు చెల్లించాలని లేకుంటే, స్టాక్ పంపబోమని, ముందు చెల్లించిన డబ్బులు సైతం తిరిగి ఇవ్వబోమని బ్లాక్ మెయిల్ చేస్తూ వచ్చాడు. వెంటనే స్పందించిన రత్నరాజు 1930కు కాల్ చేసి అన్ని వివరాలతో ఫిర్యాదు చేశాడు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బాధితుడు పోగొట్టుకున్న రూ.40 వేల సొమ్మును రికవరీ చేసి, ఈనెల 18న రత్నరాజుకు సొమ్మును సైబర్ సెల్ సీఐ దాసు అందజేశారు.


బాధితుడికి సొమ్ము అందిస్తున్న సైబర్ సెల్ పోలీసులు (ఫైల్)

తక్షణమే ఫిర్యాదు చేయండి



మీరు సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు పూర్తి వివరాలు అందించాలి. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయటంతో తక్షణమే ఆర్థిక పరమైన లావాదేవీలను నిలుపుదల చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. లేదా మీ సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. 112కు కాల్ చేసి మీ సమస్యను చెప్పటం ద్వారా తక్షణమే సహాయం అందుతుంది. సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయో అర్థం చేసుకోవాలి. నేరాలకు పాల్పడే వ్యక్తుల పరిస్థితిని గమనిస్తూ, వాటికి దూరంగా ఉండడం ద్వారా ఇబ్బందుల్లో పడకుండా ఉండవచ్చు.

– జి.దాసు, సీఐ, ఏలూరు సైబర్‌సెల్

నేరాలను గుర్తించాలి

- సైబర్ నేరగాళ్లు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీకు స్కాలర్‌షిప్ వచ్చింది. మీరు రూ.10 వేలు పంపితే సొమ్ము వస్తుంది, లేకుంటే స్కాలర్‌షిప్ రాదని మాయమాటలతో నమ్మిస్తారు.
- మీ సెల్‌ఫోన్‌కు ఆకస్మికంగా ఒక వీడియో కాల్ వస్తుంది. అవతలి వ్యక్తి పోలీస్ డ్రెస్‌లో ఆఫీసర్ వేషంలో ఉంటాడు. మీపై డ్రగ్స్ లేదా మహిళల అక్రమ రవాణా కేసులు నమోదయ్యాయని భయపెడతారు. డబ్బులు ఇస్తే కేసులో లేకుండా చేస్తామంటూ నమ్మిస్తారు.
- ప్రతి రోజూ అధికంగా వినియోగించే వాట్సాప్ అకౌంట్‌ను హ్యాక్ చేస్తూ, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని వ్యక్తులకు ఏపీకే ఫైల్స్ పంపుతూ, వాటిని ఓపెన్ చేయగానే వారి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులను కాజేస్తూ ఉంటారు.
- ఏటీఎం కేంద్రాల వద్ద కొందరు నేరగాళ్లు మిమ్మల్ని టార్గెట్ చేసి, ఒరిజినల్ ఏటీఎం కార్డులను మార్చివేసి డూప్లికేట్ కార్డులు ఇస్తారు. చక్కగా మాట్లాడుతూ సహాయం చేస్తామంటూ ఏమార్చి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రాచేసుకుని జారుకుంటారు.
- ఇన్‌స్టాగామ్‌లో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి, ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతారు. వీరంతా యువత, విద్యార్థులను టార్గెట్ చేస్తుంటారు. సెల్‌ఫోన్‌కు న్యూడ్ ఫొటోలను పంపుతూ వాటిని తెరిచి చూడగానే, బ్లాక్ మెయిల్ చేస్తూ భయాందోళనకు గురిచేస్తారు. చివరికి డబ్బులు భారీగా డిమాండ్ చేస్తూ జేబులు గుల్లచేస్తారు.
- ఈ చలాన్ పెండింగ్ అంటూ రవాణాశాఖ కార్యాలయం పేరుతో లింక్స్ పంపుతారు. వాటిని ఓపెన్ చేయాలంటూ ఒత్తిడి చేస్తారు. పొరపాటున లింక్స్ ఓపెన్ చేస్తే, బ్యాంకు ఖాతా లేదా కేసుల పేరుతో భారీగా డబ్బులు గుంజటం వారికి వెన్నతో పెట్టిన విద్య.

స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కస్తూరిబా మునిసిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు 60 మందికి ఎన్ఎంఎంఎస్ పరీక్ష స్టడీ మెటీరియల్ కాళీపట్నం ఫౌండేషన్ తరఫున శంకర వెంకట సుబ్బారావు అందజేశారు. నగరంలోని వివిధ మునిసిపల్, జిల్లా పరిషత్ స్కూల్స్‌లోని సుమారు 141 మంది విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్టు చెప్పారు. ప్రధానోపాధ్యాయురాలు కె.మాధవీలత మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ అర్హత సాధిస్తే విద్యార్థులకు రాబోయే ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ లభిస్తుందని తెలిపారు. ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు చెప్పారు. పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ బి.సుష్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య విద్య, వైద్యం అందించే దిశగా పని చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ హితవు పలికింది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఏలూరు ప్రభుత్వ కళాశాలగా మార్చడంతో జిల్లా ప్రధానాసుపత్రి హోదా కోల్పోయిందని, దాని ఫలితంగా పడకలు తగ్గిపోయాయని, సిబ్బంది కొరత ఏర్పడిందని, రోగాలకు రిఫరెన్స్ రాసే ఆసుపత్రిగా మిగిలిపోయిందని పేర్కొన్నారు. దీంతో ఏలూరు, చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజుకు వందల సంఖ్యలో వచ్చి ఉచిత వైద్యం చేయించుకునే రోగులకు నేడు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి ప్రభుత్వ ఆసుపత్రులు రోగులకు దూరం కాకుండా, వారికి మరింత మెరుగైన వైద్యం ఉచితంగా అందించే ఆసుపత్రిలుగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని రవి కోరారు.

'కొఠారు కుటుంబానికి రుణపడి ఉంటా'


మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న జెడ్పీటీసీ దంపతులు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు కుటుంబాలకు తమ కుటుంబం రుణపడి ఉంటుందని దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలా నవకాంతం, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంగరాజు అన్నారు. శనివారం జోగన్నపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట ఇదే రోజున దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలిగా అవకాశం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీతో పాటు పార్టీ శ్రేణులు, ప్రజలు ఆదరించడంతో జెడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యానని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో అబ్బయ్య చౌదరిని దెందులూరు ఎమ్మెల్యేగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు.

అక్షర ఆంధ్ర విజయవంతం చేయాలి

టి.నరసాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. శనివారం టి.నరసాపురంలో ఉన్న మూడు అక్షరాల కేంద్రాలను సందర్శించి అభ్యాసకులకు పలు సూచనలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి నిరక్షరాస్యులైన మహిళలను, ఉపాధి హామీ పథకంలోని పురుషులను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ విద్యలను ప్రతి ఒక్కరూ నేర్చుకుని నేటి తరంతో పోటీ పడాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్ విజయకుమార్ తెలిపారు. మండలంలో 2,400 మంది డ్వాక్రా మహిళలకు, ఉపాధి హామీ పథకంలోని 1000 మంది పురుషులను అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టారని తెలిపారు. వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

దెందులూరులో జోరు వాన

దెందులూరు: శనివారం సాయంత్రం కురిసిన జోరువానకు రోడ్లు చిత్తడిగా మారాయి. గుంటలు పడిన రోడ్లు వర్షపు నీటితో నిండిపోయి ప్రయాణానికి తీరని ఇబ్బందిగా మారాయి. ఈదురు గాలులతో కూడిన జోరు వాన కురిసింది. వాహనచోదకులు రైతులు, కూలీలు ఎక్కడ వారు అక్కడే చెట్లు షాపులు బ్రిడ్జిలు కింద నాలుగున్నర గంటలసేపు నిలిచిపోయారు. దెందులూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రోడ్డు, మాజీ సర్పంచ్ తొత్తడి వేదకుమారి రోడ్డు నడవడానికి వీలులేని విధంగా అధ్వానంగా తయారయ్యాయి. మరోపక్క ఈ నెలలోనే అనేకసార్లు కురిసిన వర్షాలు తమ చేలకు నష్టమే కలుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహిళా చట్టాలపై స్థానిక అమీనా పేట సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం అవగాహన కార్యక్రమం జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎస్ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో శక్తి టీం సభ్యులు ఏర్పాటుచేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై మహిళా ఎస్సై నాగమణి అవగాహన కల్పించారు. అదనపు ఎస్పీ అడ్మిన్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో చదివే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శక్తి యాప్ లేదా డయల్ 112కు సమాచారం అందిస్తే సమీప పోలీస్ గస్తీ బృందం తక్షణమే బాధితులకు రక్షణగా నిలిస్తుందని తెలిపారు. శక్తి యాప్ నంబర్ 79934 85111, ఎమర్జెన్సీ నంబర్ 112, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181కు నేరుగా యాప్ నుంచి కాల్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

24న జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం శ్రీ రామచంద్ర జూనియర్ కాలేజీలో ఈనెల 24న జాబ్ మేళ నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ జితేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 691 ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశ ఉందని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసు ఉండి, పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 96663 22032, 96425 98324లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరు కావాలని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): 15 నెలల గడుస్తున్నా ఎటువంటి సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అందలేదని, ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సీఐటీయూ అనుబంధ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటికి వినతిపత్రం అందించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన 100 రోజుల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్ర రాంబాబు, కార్యదర్శి గురజోలు సాంబశివరావు, ఎర్రంశెట్టి సుబ్బారావు, పరస శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం: పేద మహిళలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ దళిత, ఎస్సీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీకి చెందిన అనేక మంది పేద మహిళలు పనులు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. అర్హులైన మహిళలను గుర్తించి అంత్యోదయ పథకంలో 35 కేజీల బియ్యాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఒక తహసీల్దార్ పీవీ చలపతిరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, సావిత్రి, మరియమ్మ, లలితకుమారి, రాధ, మారతమ్మ, బేబీ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగర ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జూట్ మిల్ సమీపంలో కృష్ణ కాలువ వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం, అనంతరం సభ నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర లక్ష్యాలను వివరించారు. మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

- ఏలూరు టౌన్: పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని జీఎస్టీ అధికారి కె.చిట్టిబాబు అన్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఏలూరు సర్కిల్–2 కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, సిబ్బందితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఏలూరు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ జి.జాన్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

అలరించిన సాహిత్య కార్యక్రమాలు


భువన విజయం సభలో పాల్గొన్న సాహితీవేత్తలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక వైఎంహెచ్ఏ హాలులో రెండు రోజుల పాటు నిర్వహించే ఆలపాటి రామచంద్రరావు సాహిత్య, సంగీత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు నిర్వహించిన భువన విజయం, అష్టావధానం కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఈ సందర్భంగా అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ మాట్లాడుతూ సంగీత, సాహిత్య, నృత్య, నాటక, రంగస్థల కళా రంగాలను ప్రోత్సహించాలని, తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకోవాలనే అభిలాషతో రామచంద్రరావు శతవసంతాల ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వద్దిపర్తి పద్మాకర్ నిర్వహణలో తిరుపతికి చెందిన ఉప్పలదడియం భరత్ శర్మ, ప్రముఖ సాహితీవేత్తల అనుసంధానంతో నిర్వహించిన అష్టావధానం అలరించింది. సాయంత్రం సాహితీవేత్తలచే నిర్వహించిన భువన విజయ సభ శ్రీ కృష్ణదేవరాయల కాలం నాటి సభను స్ఫురణకు తీసుకొచ్చి అలరించింది. తొలుత ఈ కార్యక్రమాలను అంబికా కృష్ణ, ఉషా గ్రూప్ సంస్థల చైర్మన్ వీవీ బాలకృష్ణారావు, వైఎంహెచ్ఏ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు జ్యోతి ప్రకాశనంతో కార్యక్రమాలను ప్రారంభించారు.

రహదారి అధ్వానంపై రైతుల నిరసన


పరింపూడి, కన్నాయిగూడెం గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రహదారిపై రాకపోకలు సాగిస్తున్న రైతులు

కొయ్యలగూడెం: రైతులు ఆరోపించిన విధంగానే పరింపూడి, కన్నాయిగూడెం గ్రామాల మధ్య నూతనంగా నిర్వహిస్తున్న రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల ఎన్ఆర్ఇజీఎస్ నిధులు రూ.70 లక్షలతో పాత పరింపూడి నుంచి కన్నాయిగూడెం వరకు గ్రావెల్ రోడ్డు మంజూరైంది. కొద్ది నెలల క్రితం నాణ్యతలేని గ్రావెల్‌తో నిర్మిస్తున్నారంటూ రైతులు ఆందోళన చేయడంతో వ్యవహారం బయటికి వచ్చింది. కూటమి నాయకులు సిండికేట్‌గా వ్యవహరించి ఏమాత్రం నాణ్యతలేని ప్రమాణాలతో ఉన్న బంక మట్టిని తీసుకువచ్చి రోడ్డుపై పోసారని రైతులు ఆరోపించారు. నాటి ఆరోపణలకు తగ్గట్టుగా ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి చిత్తడిగా మారి నడవడానికి వీలు లేకుండా మారింది. ఈ నేపథ్యంలో రైతులను బుజ్జగించే ప్రక్రియను కూటమి నాయకులు భుజాన వేసుకుని వారిపై ఒత్తిడి తేవడం ప్రారంభించినట్లు తెలిసింది. అయితే రైతులు మాత్రం ఇప్పటివరకు జరిగిన అవకతవకలపై విచారణ చేసి నాణ్యత కలిగిన గ్రావెల్‌ను వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా మూడు లేయర్లుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది అని మొదటి లేయర్ వరకే పనులు కొనసాగాయని చెప్పారు.

మందుల దుకాణాల్లో దాడులు!

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఔషధ నియంత్రణ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. దీనికి అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో దాడులు నిర్వహించారు. ఈ నెల 18న జంగారెడ్డిగూడెంలో దాడులు నిర్వహించారు. వీటిపై మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఇటీవల బుట్టాయగూడెం రోడ్‌లో ఒక మెడికల్ షాపులో కాలం చెల్లించిన మందులను గుర్తించారు. బుట్టాయగూడెం రోడ్‌లో ఒక ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌పై తనిఖీ చేసేందుకు వెళ్లగా, ఆ ఆర్ఎంపీ క్లీనిక్ మూసివేసి వెళ్లిపోయినట్లు సమాచారం. క్లినిక్‌లో అబార్షన్‌లు, ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు తనిఖీలు చేసేందుకు వచ్చినట్లు తెలిసింది. అయినా మీడియాకు సమాచారం ఇవ్వలేదు. విలేకరులు అడిగితే మెడికల్ షాపుల అసోసియేషన్ గ్రూపుల్లో సమాచారం పెట్టామని చెప్పాడం అనుమానాలకు తావిస్తోంది. మెడికల్ షాపుల అసోసియేషన్ ప్రతినిధులను వెంటబెట్టుకొని షాపులపై దాడులు చేస్తూ ఉండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసోసియన్ ప్రతినిధులకు నచ్చని వ్యక్తులపైనే దాడులు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	36	బీన్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	00	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	00
కాకర కాయలు	34	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	26	అల్లం	70-96
క్యారెట్	44	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	15	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	30